క్లుప్తంగా

అంబేద్కర్ విగ్రహానికి వినతి



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న దళితబంధు లబ్ధిదారులు

తుంగతుర్తి : దళితబంధు నిధులు విడుదల చేయాలని కోరుతూ సోమవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి లబ్ధిదారులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం దళితుల అభ్యున్నతి కోసం దళితబంధు పథకం ప్రవేశపెట్టి దళితుల జీవితాల్లో వెలుగులు నింపిందన్నారు. ఈ కార్యక్రమంలో గుడిపాటి వీరయ్య, మల్లేపాక రాములు, పాల్వాయి వెంకన్న, కొమ్ము వెంకన్న, గద్దం సోమేష్, వెంకటనర్సు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సన్మానం

తిరుమలగిరి : ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులు సామాజిక సేవలో భాగస్వాములు కావాలని మండల విద్యాధికారి ఐ.శాంతయ్య కోరారు. తిరుమలగిరి మండలం వేమ్లా తండా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చిత్తలూరి పుల్లయ్య ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పుల్లయ్య దంపతులను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.వెంకటేశ్వర్లు, తిరుపతిరెడ్డి, సత్తిరెడ్డి, లక్ష్మణ్, రామ్ తదితరులు పాల్గొన్నారు.

సాయుధ పోరాట యోధురాలికి నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

మద్దిరాల : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాంద్ బీ మృతి సీపీఎంకు తీరని లోటని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కోట గోపి అన్నారు. గోరెంట్ల గ్రామానికి చెందిన సీపీఎం నాయకురాలు చాంద్ బీ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందడంతో ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కందాల శంకర్‌రెడ్డి, గ్రామ శాఖ కార్యదర్శి దీకొండ ఉపేందర్, నాయకులు పోలోజు సైదులు, రంగయ్య, బద్దం మల్లారెడ్డి, సత్యం, ఎల్లయ్య, కన్నె వీరన్న, వెంకన్న, చంద్రయ్య, లింగయ్య, దేవయ్య పాల్గొన్నారు.

వెలుగుపల్లి వాసికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న మహేష్

తుంగతుర్తి : వెలుగుపల్లి గ్రామానికి చెందిన ముత్యాల మహేష్ చేస్తున్న సామాజిక సేవలను గుర్తించి సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ సరస్వత పరిషత్ ఆడిటోరియంలో డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆసియన్ వేదిక్ ఇంటర్నేషనల్ కల్చర్ అండ్ రీసెర్చ్ స్ఫూర్తి అకాడమి, స్ఫూర్తి ఇంటర్నేషనల్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్, పీస్ ఆఫ్ ఇండియా ఎన్జీఓ, స్ఫూర్తి సర్వీస్ సొసైటీ ఇండియా ఎన్జీఓ, ఆసియా వేదిక్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో గౌరవ డాక్టరేట్‌ను అందజేశారు. డాక్టర్ లయన్ ఆకుల రమేష్ చేతుల మీదుగా డాక్టరేట్‌ను ప్రదానం చేశారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఆత్మకూర్ (ఎస్) : స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఐటీసీ గ్రీన్ క్రాస్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని నెమ్మికల్‌లో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీసీ గ్రీన్ క్రాస్ మండల ఇన్‌చార్జ్ అనంతుల రవీందర్ మాట్లాడారు. గ్రామంలోని వీధుల్లో, రోడ్లపై చెత్తాచెదారం లేకుండా, ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. పచ్చదనం పరిశుభ్రతపై గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి రమణ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం శ్రీహరి, ఏఎన్ఎం పూలమ్మ, ఆశ వర్కర్లు, ఐటీసీ గ్రీన్ క్రాస్ ప్రతినిధులు సురేష్, వెంకన్న, నవీన్, అంగన్వాడీ టీచర్ ఎం.శోభారాణి, జి.రజిత, ఆర్.పద్మ, వీబీకే వి.ఇందిరా, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన

నడిగూడెం : ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని సూర్యాపేటలో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి చిత్ర లేఖనం పోటీల్లో నడిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి వంశీ ప్రథమ బహుమతి పొందాడు. దీంతో కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వంశీని ప్రిన్సిపాల్ విజయనాయక్ అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

హక్కులకు భంగం కలిగిస్తే చర్యలు



సివిల్ రైట్స్ డేలో పాల్గొన్న అధికారులు, ప్రజలు



పెన్‌పహాడ్ : మాట్లాడుతున్న ఎస్ఐ రవీందర్

పెన్‌పహాడ్ : సమాజంలో పౌరుల హక్కులకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ రవీందర్, ఆర్ఐ రంజిత్‌రెడ్డి అన్నారు. సోమవారం సింగారెడ్డి పాలెం గ్రామంలోని ఎస్సీ కాలనీలో నిర్వహించిన పౌర హక్కుల దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి వ్యక్తికి చట్టపరంగా హక్కులు, విధులు ఉన్నాయని తెలిపారు.అసమానతలను, అంటరానితనాన్ని ప్రేరేపించే వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. ఒకరి పట్ల ఒకరు ప్రేమానురాగాలతో కలిసి మెలసి జీవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయ తీ కార్యదర్శి అఖిల్, కొండేటి సతీష్, పాల్వాయి చంద్రశేఖర్, చంటి, గోపయ్య, నాగయ్య, రాంబాబు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి : తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో సోమవారం సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడారు. కుల, మతాలకు సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు, చట్టపరమైన రక్షణ కల్పించాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం సివిల్ రైట్స్ డేను నిర్వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మామిడి బుచ్చిబాబు, డిప్యూటీ తహసీల్దార్ జాన్ మహ్మద్, వార్డు కౌన్సిలర్ సంకెపల్లి జ్యోతి, హెడ్ కానిస్టేబుల్ రమేష్, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ : పౌర హక్కులకు భంగం కలిగిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని సీనియర్ సహాయకుడు రామచంద్రయ్య అన్నారు. సోమవారం తాళ్ల సింగారం గ్రామంలోని హరిజన కాలనీలో నిర్వహించిన పౌర హక్కుల దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరూ సమానత్వంతో కలిసి మెలసి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి గిలకత్తుల సుధాకర్, ఫీల్డ్ అసిస్టెంట్ మల్లారెడ్డి పాల్గొన్నారు.

నాగారం : రాజ్యాంగం కల్పించిన చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని మండల సాంఘిక సంక్షేమ అధికారి సోమాచారి అన్నారు. పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా సోమవారం వర్ధమానుకోటలోని ఎస్సీకాలనీలో ఏర్పాటు చేసిన గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం దళితల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ షాహిన్‌బేగం, పంచాయతీ కార్యదర్శి అంబేద్కర్, ఆర్ఐ అల్లావుద్దీన్, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజలు భయాందోళన చెందొద్దు

- పేదల ఇళ్లను కూల్చేది లేదు
- రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి



మాట్లాడుతున్న పటేల్ రమేష్ రెడ్డి

సూర్యాపేట : సూర్యాపేట జిల్లా కేంద్రంలో హైడ్రా తరహా కూల్చివేతలు ఉండబోవని, ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటే పేదల ప్రభుత్వమని, సూర్యాపేటకు హైడ్రాతో ఎలాంటి సంబంధం లేదన్నారు. హైడ్రా కేవలం ఓఆర్ఆర్ లోపల మాత్రమే పనిచేస్తుందన్నారు. సూర్యాపేటలో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల సర్వే చేయమని ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు లేవని చెప్పారు. బీఆర్ఎస్ నాయకులు కావాలని ప్రజలను తప్పుదోవ పట్టించి భయానికి గురిచేస్తున్నారని అన్నారు. సూర్యాపేటలో సద్దుల చెరువు, పుల్లారెడ్డి చెరువులకు కట్టల నిర్మాణం జరిగిందని, చెరువు కట్టల బయట జరిగిన నిర్మాణాలు కూల్చడం జరగదని చెప్పారు. సూర్యాపేటలో సద్దుల చెరువు సుందరీకరణ, పార్క్ నిర్మాణం కోసం రూ.10 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. పిల్లలమర్రి, ఉండ్రుగొండ దేవాలయాల అభివృద్ధికి ఐదున్నర కోట్లు కేటాయించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామ్మూర్తి యాదవ్, ముదిరెడ్డి రమణారెడ్డి, షఫీ ఉల్లా, అరుణ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ



సూర్యాపేట టౌన్ : బతుకమ్మలతో మహర్షి డిగ్రీ కళాశాల విద్యార్థినులు

సూర్యాపేటటౌన్ : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ అని జిల్లా కేంద్రంలోని మహర్షి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పల్లె నగేష్ అన్నారు. సోమవారం కళాశాలలో ముందస్తుగా బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించారు. అనంతరం అధ్యాపకులు, విద్యార్థులు కలిసి బతుకమ్మ పాటలను ఆలపిస్తూ ఆడిపాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ నారాయణ ప్రవీణ్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ జిన్నె రమాదేవి పాల్గొన్నారు.

ముందస్తుగా బతుకమ్మ వేడుకలు

అర్వపల్లి : మండల పరిధిలోని కోమటిపల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం ముందస్తు బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి బతుకమ్మలు పేర్చి ఆడిపాడారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఉల్లెందుల సైదులు, ఉపాధ్యాయురాలు ఆర్. సృజన, అంగన్‌వాడీ టీచర్ టి. శివరంజని, యశోద, పద్మ తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల : మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాలలో సోమవారం ముందస్తుగా బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎస్ఓ తేజశ్రీ, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బొడ్డెమ్మ పండుగ

మద్దిరాల : మండల పరిధిలోని గోరెంట్ల గ్రామంలో సోమవారం బొడ్డెమ్మ పండుగను జరుపుకున్నారు. బంధు భారతమ్మ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో మహిళలు విజయ, మంగమ్మ, లక్ష్మి, సుజాత, రమ, హరిత, తదితరులు పాల్గొన్నారు.



అర్వపల్లి : కోమటిపల్లి ప్రాథమిక పాఠశాలలో..



మద్దిరాల కేజీబీవీలో..

ప్రజా ఉద్యమాలు నిర్మిద్దాం

తిరుమలగిరి : యాభై ఏళ్ల పీడీఎస్‌యూ పోరాట స్ఫూర్తితో బలమైన ప్రజా ఉద్యమాలను నిర్మిద్దామని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పి.మహేష్ అన్నారు. సోమవారం మున్సిపల్ కేంద్రంలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం అర్ధ శతాబ్ది ఉత్సవ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ సూర్యాపేట జిల్లా కార్యదర్శి డేవిడ్‌కుమార్, పీడీఎస్‌యూ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇందూరిసాగర్, టీపీటీఎఫ్ మాజీ జిల్లా అధ్యక్షుడు వాసం ప్రభాకర్, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్, డివిజన్ అధ్యక్షుడు సంపేట కాశయ్య, డివిజన్ కార్యదర్శి పిడమర్తి భరత్, జిల్లా సహాయ కార్యదర్శి జక్కుల సుధాకర్, రాయిల రాజ్‌కుమార్, మండల అధ్యక్షుడు బానోతు యాకన్న, శ్రీచరణ్, దివ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్‌లో సీటు



దాసరి నిఖిత

ఆత్మకూర్ (ఎస్) : మండల పరిధిలోని తుమ్మలపెన్‌పహాడ్ గ్రామానికి చెందిన దాసరి శంకర్, నాగమణిల కుమార్తె నిఖిత మొదటి ప్రయత్నంలోనే ఎంబీబీఎస్ సీట్ సాధించింది. తమ కుమార్తె ఎంబీబీఎస్‌లో సీట్ సాధించటంతో శంకర్ నాగమణి దంపతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నిఖితను కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

ఘనంగా వయోవృద్ధుల దినోత్సవం



సూర్యాపేట : వయోవృద్ధులను సన్మానిస్తున్న అంగన్‌వాడీలు

సూర్యాపేట : పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఐసీడీఎస్ సీడీపీఓ సుబ్బలక్ష్మి అన్నారు. సోమవారం 23వ వార్డులోని కమ్యూనిటీ హాల్‌లో బొడ్రాయి బజార్ సెక్టార్ ఆధ్వర్యంలో పోషకాహార వారోత్సవాలను నిర్వహించారు. అనంతరం వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా సీనియర్ సిటిజన్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వల్దాసు సౌమ్య, సూపర్‌వైజర్ నాగమణి, సుజాత, ఉషా, చంద్రకళ, ప్రభావతి, ఊర్మిళ, సైదమ్మ పాల్గొన్నారు.

నాగారం : మండల పరిధిలోని నాగారంబంగ్లా అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో సోమవారం వయోవృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీల మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులను, వృద్ధులను గౌరవించాలన్నారు. వృద్ధుల పట్ల ప్రేమతో మెలగాలన్నారు. అనంతరం వయోవృద్ధులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఆర్.సుమిత్ర, జి.సరస్వతి, హరిత, లక్ష్మి, మంజుల, అంగన్‌వాడీ ఆయాలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

మద్దిరాల : మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలు 2, 4ల ఆధ్వర్యంలో సోమవారం వయోవృద్ధుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు గ్రాండ్ పేరెంట్స్‌కు పుష్పాలను అందజేసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.



నాగారంబంగ్లాలో వయోవృద్ధులకు సన్మానం..



మద్దిరాల అంగన్‌వాడీ కేంద్రంలో..

అమరుల స్ఫూర్తితో సమస్యలపై ఉద్యమించాలి



మాట్లాడుతున్న నెమ్మాది వెంకటేశ్వర్లు

పెన్‌పహాడ్ : అమరవీరుల స్ఫూర్తితో ప్రజా సమస్యలపై ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం నాగులపాటి అన్నారం గ్రామంలో నిర్వహించిన సీపీఎం గ్రామ శాఖ సభలో పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు వాగ్దానాలను తక్షణమే అమలు పర్చాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగానే ఈ ప్రభుత్వం కూడా ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేయడం సరైనది కాదన్నారు. పేదల జోలికొస్తే ఎర్రజెండా ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం గ్రామశాఖను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ కార్యదర్శిగా ఐతబోయిన సత్యనారాయణ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ధనియాకుల శ్రీకాంత్‌వర్మ, మండల కార్యదర్శి రణపంగ కృష్ణ, వీరబోయిన రవి, ఐతబోయిన సత్యం, ఐతబోయిన వెంకన్న, తారమ్మ, ధనియాకుల శ్రీనివాస్, నర్సయ్య, సత్యం, అభిలాష్, వెంకన్న, సాయి, ముత్తయ్య, పాపయ్య, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : ఓట్ల కోసం సాధ్యం కాని పథకాలు ప్రకటించి గెలిచిన తర్వాత ప్రజలను బిచ్చగాళ్ల మాదిరిగా ఆ పథకం కోసం ఎదురుచూసేలా చేస్తున్నారని సీపీఎం మండల కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ అన్నారు. సోమవారం వెలుగుపల్లిలో సీపీఎం గ్రామ శాఖ మహాసభలో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో గద్దం ఎల్లయ్య, గుడిపాటి వెంకయ్య, మల్లెపాక రామచంద్రం, మల్లయ్య, సత్తయ్య, నాగరాజు, పిచ్చమ్మ, బురకమ్మ పాల్గొన్నారు.

బాలికల గురుకుల పాఠశాలకు భవనం నిర్మిస్తాం

- తుంగతుర్తి ఎమ్మెల్యే సామేల్



కాసర్లపహాడ్‌లో స్థలాన్ని పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సామేల్

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలకు కాసర్లపహాడ్‌లో 7ఎకరాల స్థలాన్ని కేటాయించడం జరిగిందని, ఈ స్థలంలో పాఠశాలకు భవనాన్ని అన్ని హంగులతో నిర్మించడానికి కృషి చేస్తున్నట్లు తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ తెలిపారు. సోమవారం కాసర్లపహాడ్‌లో గురుకుల పాఠశాల స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి ఈ భవన నిర్మాణ విషయాన్ని తీసుకెళ్లి త్వరలో నిధులు మంజూరు చేయించనున్నట్లు చెప్పారు. ఈ స్థలంలో గురుకుల పాఠశాల, కళాశాలలను నిర్మిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మోరపాక సత్యం, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుడిపెల్లి మధుకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ అవిలయ్య, బైరబోయిన మహరాజు, రామలింగయ్య, దిర్శనపు యాదయ్య, బొల్లం లింగరాజు, నల్లగుంట్ల శ్రీనివాస్, బద్దం యాదగిరి, మచ్చ నర్సయ్య, నల్లగుంట్ల రవి, రాజేష్, దిర్శనపు కృష్ణమూర్తి, లింగయ్య, సురేందర్ పాల్గొన్నారు.

కాసర్లపహాడ్ పల్లె దవాఖానా తనిఖీ

మండల పరిధిలోని కాసర్లపహాడ్ గ్రామ పల్లె దవాఖానాను తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిజిస్టర్లు పరిశీలించారు. సిబ్బంది వివరాలను, అందిస్తున్న సేవలను తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధుల దృష్ట్యా వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు తగు వైద్యం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుడిపెల్లి మధుకర్‌రెడ్డి, బొల్లం లింగరాజు, ఎంఎల్‌హెచ్‌పీ గౌతమి, ఆశా కార్యకర్తలు అన్నపూర్ణ, సుజాత, శాంతి తదితరులు పాల్గొన్నారు.

రైతులు చిరు ధాన్యాల వైపు దృష్టి సారించాలి

నాగారం : రైతులు సంప్రదాయ పంటలతోపాటు చిరు ధాన్యాల సాగువైపు దృష్టి సారించాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నాఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆగ్రోఫెడ్ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ దుకాణాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ బ్రహ్మయ్య, ఎంపీడీఓ ధారా శ్రీనివాస్, ఏఓ కృష్ణకాంత్, ఏపీఎం శోభారాణి, ఎఫ్‌పీఓ చైర్మన్ కోడి కంటి సంధ్య, వైస్‌చైర్మన్ కుంభం లింగయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల బుచ్చిబాబు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్య, సుంకరి జనార్దన్, పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

మండల పరిధిలోని పేరబోయినగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు గండమల్ల లక్ష్మయ్య సతీమణి గండమల్ల కళమ్మ, అలాగే ఫణిగిరి గ్రామానికి చెందిన వడ్డేపల్లి సోమయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మందుల సామేల్ సోమవారం మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, ఒక్కొక్క కుటుంబానికి రూ.5,000 చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే ఫణిగిరి గ్రామానికి చెందిన సలిబిండ్ల రాయలురెడ్డి అనారోగ్యంతో బాధపడుతుండగా ఆయనను కలిసి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల బుచ్చిబాబు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్య, ఎల్మకంటి సోమన్న, అశోక్‌రెడ్డి, పానుగంటి నర్సింహారెడ్డి, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ ఫలితాల్లో ఉద్యోగానికి ఎంపిక



నరేందర్



హరికృష్ణ



శ్రావణ్‌కుమార్



సైదులు

సూర్యాపేటటౌన్ : డీఎస్సీ ఫలితాల్లో సూర్యాపేటకు చెందిన ఉయ్యాల నరేందర్ ఎస్‌జీటీ విభాగంలో 87.5 మార్కులు సాధించి జిల్లా మొదటి ర్యాంకు సాధించారు. తుంగతుర్తి రెసిడెన్షియల్ పాఠశాలలో సెకండరీ విద్యాభ్యాసం పూర్తి చేసి ప్రస్తుతం సెంట్రల్ రైల్వే విభాగంలో ఉద్యోగం చేస్తున్నారు. సొంత ఊరు మునగాల మండలం నరసింహుల గూడెం.

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని లింగాల గ్రామానికి చెందిన మిర్యాల హరికృష్ణ సోమవారం విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో ఎస్జీటీ విభాగంలో 78.33 మార్కులు సాధించి 21వ ర్యాంకు పొందాడు. సర్వేల్ పాఠశాలలో టీజీటీ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న లింగాల గ్రామానికి చెందిన ఏసురాజు సైదులు స్కూల్ అసిస్టెంట్ తెలుగు విభాగంలో 82.23 మార్కులు సాధించి 1వ ర్యాంకు సాధించాడు. అనంతారం గ్రామానికి చెందిన ఉప్పునూతల శ్రావణ్‌కుమార్ ఎస్జీటీ విభాగంలో 76.97 మార్కులు సాధించి 34వ ర్యాంకు సాధించాడు.

వీఓఏల చేతివాటం.. స్త్రీనిధి డబ్బులు దుర్వినియోగం



తుంగతుర్తిలోని మహిళా సమైక్య కార్యాలయం

తుంగతుర్తి : మహిళా సమాఖ్యలో పనిచేస్తున్న వీఓఏలు స్త్రీనిధి నిధులను తమ సొంత అవసరాలకు వాడుకున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఇటీవల జరిగిన సోషల్ ఆడిట్‌లో పలు గ్రామాల వీఓఏలు నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని తేలింది. దీంతో అధికారులు కూడా ఆ గ్రామాల్లోకి వెళ్లి విచారించి అక్రమాలు జరిగాయని తేల్చారు. కరివిరాల గ్రామంలో వీఓఏ రూ.4 లక్షల 50 వేలు, రావులపల్లి గ్రామంలో వీఓఏ రూ.15 లక్షలు దుర్వినియోగానికి పాల్పడినట్లు తెలిసింది. నిధుల దుర్వినియోగానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకునేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నట్లు సమాచారం.

డబ్బులు రికవరీ చేస్తాం

వీఓఏలు మహిళా సమాఖ్య డబ్బులను వసూలు చేసి బ్యాంకు ఖాతాలో జమ చేయని విషయం మా దృష్టికి వచ్చింది. ఈ విషయమై స్పెషల్ ఆడిట్ చేసి డబ్బులు రికవరీ చేయిస్తాం. నిధుల దుర్వినియోగానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటాం.

– మధు, స్త్రీనిధి మేనేజర్

ఓటు హక్కు నమోదుపై అవగాహన

చివ్వెంల : వరంగల్ – ఖమ్మం – నల్లగొండ నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి ఓటు నమోదు చేసుకోవాలని తెలంగాణ ప్రాంతీయ ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) రాష్ట్ర మాజీ అధ్యక్షుడు తీకుళ్ల సాయిరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో టీపీయూఎస్ ఆధ్వర్యంలో ఓటు నమోదుపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు, లెక్చరర్లు తమ ఓటును ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ దండ మురళీధర్ రెడ్డి, పాండు రంగాచారి, ఎంఈఓ కళారాణి పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక

తుంగతుర్తి : మండల కేంద్రానికి చెందిన వీరబోయిన అఖిలేష్ యాదవ్ క్రికెట్ అండర్ –14 విభాగంలో రాణించి ఉమ్మడి జిల్లాస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎన్జీయం క్రికెట్ అకాడమిలో జరుగుతున్న క్రికెట్ పోటీల్లో అతడు ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. ఈ నెల 3న జరిగే ఉమ్మడి జిల్లాస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు.

గ్రామ పంచాయతీకి వీధిలైట్ల బహూకరణ

నాగారం : మండల పరిధిలోని మాచిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీకి గ్రామానికి చెందిన యువకులు సోమవారం రూ.35వేల విలువ గల వీధిలైట్లను కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు పసుపులేటి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో బహూకరించారు. ఈ సందర్భంగా పసుపులేటి వెంకట్‌రెడ్డి మాట్లాడారు. గ్రామాభివృద్ధికి యువకుల సహకారం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంతోష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు శీల కృష్ణమూర్తి, పిన్నమరెడ్డి సోమిరెడ్డి, వడ్డే యాదగిరి, యువకులు కోడూరు నరేష్, మాద అశోక్, హరీష్, నాతి భాస్కర్, నాతి వికాస్ పాల్గొన్నారు.

మంత్రి ఉత్తమ్‌కు పరామర్శ

కోదాడ : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తండ్రి పురుషోత్తంరెడ్డి ఆదివారం మరణించారు. సోమవారం హైదరాబాద్‌లోని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నివాసంలో ఆయనను, కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డిని కోదాడకు చెందిన విద్యాసంస్థల నిర్వాహకులు పరామర్శించారు. ఈ సందర్భంగా పురుషోత్తంరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కేజీ టూ పీజీ విద్యాసంస్థల మాజీ చైర్మన్ గింజల రమణారెడ్డి, పందిరి నాగిరెడ్డి, కాంగ్రెస్ నాయకుడు వెంపటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌పుస్తకాల పంపిణీ

నూతనకల్ : దాతలు అందిస్తున్న సహాయ, సహకారాలను ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు దరావత్ శివయ్య అన్నారు. మిర్యాల ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు గ్రామానికి చెందిన కాస శ్రీనివాస్, ధారం శ్రీనివాస్‌లు తమ స్నేహితుడు మెంచు సోమనర్సయ్య జ్ఞాపకార్థం సోమవారం నోట్‌పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇమ్మారెడ్డి లింగారెడ్డి, వెంకన్న, గునగంటి వెంకన్న, అవిలయ్య, సైదులు, ప్రకాష్, సుధాకర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.